


ఎన్టీఆర్ పార్క్ అభివృద్ధికి చర్యలు: ఇన్‌చార్జి పీవో

సీతంపేట రూరల్, సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ తెలిపారు. బుధవారం పార్క్‌లో పర్యాటకుల కోసం ఏర్పాటుచేసిన ఈవెంట్లను పరిశీలించారు. ఆల్‌టెర్రయిన్ వాహనాలను నడిపారు. కొత్త ఈవెంట్‌లను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. పార్క్ పరిసరాలు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని సిబ్బందికి సూచించారు.





ప్రస్తావించండి.. ప్లీజ్!

- నేటి నుంచి శాసనసభ సమావేశాలు
- మంత్రి, ఎమ్మెల్యేలపై కొండంత ఆశలు
- జిల్లాలో సమస్యలెన్నో..
- పరిష్కార మార్గం చూపాలని ప్రజల విన్నపం

పార్వతీపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఒకవైపు పాలనను గాడిలో పెడుతూనే.. జిల్లాలో అభివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. అదే సమయంలో ఎమ్మెల్యేల చొరవతో నియోజకవర్గాల సమస్యలు సైతం పరిష్కారం అవుతున్నాయి. అయితే శాశ్వత సమస్యల పరిష్కారంలో మాత్రం ఆశించిన స్థాయిలో పురోగతి లేదు. కీలకమైన ప్రాజెక్టుల పనులు, పారిశ్రామికీకరణ జరగడం లేదు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో జిల్లా సమస్యలను ప్రస్తావించి ప్రభుత్వం నుంచి నిధులు తీసుకొస్తారని ఎమ్మెల్యేలపై జిల్లా వాసులు కొండంత ఆశలు పెట్టుకున్నారు. అసెంబ్లీలో గళం వినిపించాలని, సాధ్యమైనన్ని నిధులు మంజూరయ్యేలా చొరవ ప్రదర్శించాలని కోరుతున్నారు.

ప్రధాన సమస్యలివీ..

- జిల్లాలో జంఝావతి ప్రాజెక్టు పెండింగ్ పనులు పూర్తి చేసేందుకు ఒడిశాతో ఉన్న వివాదాన్ని పరిష్కరించాల్సి ఉంది. స్థానిక వనరులను ఉపయోగించుకుని ఆ ప్రాజెక్టు ద్వారా 24 వేల ఎకరాలకు సాగునీటితో పాటు పార్వతీపురం పట్టణవాసులుకు తాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ , పెదంకలం, వట్టిగడ్డ ప్రాజెక్టుల ద్వారా శివారు భూములకు నీరు అందించాలి.
- గత వైసీపీ ప్రభుత్వం హయాంలో కురుపాంలో ప్రారంభమైన గిరిజన ఇంజనీరింగ్ కళాశాల పనులు పూర్తికాలేదు. ఈ కళాశాల నిర్మాణం పూర్తి చేసి గిరిజన విద్యార్థులకు అందుబాటులోకి తేవాల్సి ఉంది. కొమరాడ మండలంలో పూర్ణపాడు-లాబేసు వంతెన పనులు శరవేగంగా పూర్తి చేయించాలి.
- జిల్లాకు పీపీపీ పద్ధతిలో మంజూరైన మెడికల్ కళాశాలకు సంబంధించి స్థల సేకరణతో పాటు భవన నిర్మాణాలు ప్రారంభించాలి. వచ్చే విద్యా సంవత్సరానికి వైద్య విద్యార్థులకు దాన్ని అందుబాటులోకి తేవాల్సి ఉంది.
- తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు వద్ద లిఫ్ట్

(మిగతా 8వ పేజీలో...)



కొత్త గురువులకు పిలుపు

- నేడు మోదవలస నుంచి అమరావతికి పయనం
- ఉమ్మడి జిల్లాలో భర్తీ కానున్న 578 టీచర్ పోస్టులు



సాలూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీలో ఎంపికైన కొత్త గురువులకు బుధవారం విద్యాశాఖ ఫోన్ ద్వారా పిలుపునందిం చింది. ఈ మేరకు గురువారం వారు మోదవలస నుంచి అమరావతికి పయనమవనున్నారు. 19న ఉద్యోగ నియామక పత్రం అందుకోనున్నారు. ముందుగా ఉమ్మడి జిల్లాలో కొలువు సాధించిన వారు సహాయకులను తీసుకొని డెంకాడ మండలం మోదవలస ఓయోస్టార్ ఇంటర్నేషన్ స్కూల్‌కు చేరుకోవాలి. అక్కడ ఏర్పాటు చేసిన కౌంటర్‌లో ఉదయం ఆరున్నర గంటలకు రిపోర్ట్ చేయాలి. ఆ తర్వాత వారు మోదవలస నుంచి అమరావతికి వెళ్లనున్నారు. సీఎం చంద్రబాబునాయుడు వారికి నియామక పత్రాలు అందిస్తారు. ఆ తరువాత కొత్త గురువులకు శిక్షణ ఇచ్చి పాఠశాలలను కేటాయిస్తారు. కాగా ఉమ్మడి జిల్లాలో 578 టీచర్ పోస్టులను భర్తీ చేయనున్నారు. వీరిలో 266 ఎస్జీటీలు, పాఠశాల సహాయకుల విభాగంలో సోషల్ స్టడీస్ 67, ఫిజిక్స్ 56, బయాలజీ 36, గణితం 33, తెలుగు 14, హిందీ 14, ఆంగ్లం 30, ఫిజికల్ డైరెక్టర్ 62 పోస్టులను భర్తీ చేయనున్నారు. టీచర్ పోస్టులకు ఎంపికైన 578 మందిలో 257 మంది మహిళలు టీచర్ పోస్టులు సాధించారు. పాఠశాల సహాయకుల హిందీ విభాగంలో 14 పోస్టులకు 12 మంది మహిళలే ఆ పోస్టులను సాధించడం గమనార్హం. మేనేజ్‌మెంట్ వారీగా విజయనగరం మున్సి పల్ కార్పొరేషన్‌లో 14, సాలూరు, పార్వతీపురం, బొబ్బిలి మున్సిపాలిటీల్లో 55, జడ్పీ, ఎంపీపీ స్థానిక సంస్థల్లో 372, గిరిజన సంక్షేమశాఖలో 137 పోస్టులను మెగా డీఎస్సీలో ఎంపికైన వారితో భర్తీ చేయనున్నారు.

40 బస్సుల ఏర్పాటు

డీఎస్సీలో ఎంపికైన వారి కోసం ఉమ్మడి జిల్లా నుంచి 40 బస్సులు ఏర్పాటు చేసినట్టు మన్యం జిల్లా ఆర్టీసీ డీటీపీవో వెంకటేశ్వరరావు తెలిపారు. సాలూరు డిపో నుంచి 6, పార్వతీపురం 5, పాలకొండ 6, విజయనగరం జిల్లా నుంచి 17 బస్సులు ఈ నెల 18న మోదవలస నుంచే బయలు దేరుతాయన్నారు. అమరావతిలో 19న ఉద్యోగ పత్రాల స్వీకరణ అనంతరం కొత్త గురువులను విజయనగరం తీసుకొస్తామన్నారు.

చివరి అవకాశం.. 6లో

కల సాకారం!

- మెగా డీఎస్సీలో ఎంపిక
- ఉపాధ్యాయులుగా కొలువు సాధన

మా పరిస్థితేంటి? 6లో

- గిరిజన గురుకుల ఔట్ సోర్సింగ్ టీచర్ల భవిష్యత్‌పై నీలినీడలు

పార్వతీపురంలో 8లో

చెత్త శుద్ధికి ఏర్పాట్లు

- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

నదిలో మునిగిపోయిన **నాటుబండి** 7లో

- రెండు ఎద్దుల మృతి..
- ప్రాణాలతో బయటపడ్డ రైతు

చెల్లింపుల్లో జాప్యం

- సీఎఫ్‌ఎంఎస్‌లో బిల్లుల పెండింగ్
- అభివృద్ధి పనులపై ప్రభావం

సాలూరు,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): సాలూరు మున్సిపాల్టీలో అభివృద్ధి పనులు జరుగుతున్నా.. బిల్లులు చెల్లింపుల్లో మాత్రం జాప్యం జరుగుతోంది. సీఎఫ్‌ఎంఎస్‌లో బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో కాంట్రాక్టర్లు వెనకడుగు వేస్తున్నారు. వాస్తవంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో మున్సిపాల్టీలో 15వ ఆర్థిక సంఘం నిధులు సుమారు రూ.70 లక్షలతో పనులు జరిగాయి. సీసీ రోడ్లు, కల్వర్టులు, కాలువలు నిర్మించారు. బీపీఎస్ నిధులు రూ.18 లక్షలతో పట్టణంలో పలుచోట్ల రక్షిత నీటి పథకాల పనులు చేశారు. 9 నెలల కిందట మంత్రి సంధ్యారాణి రూ.1.24 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అయితే ఇప్పటివరకు రూ.35 లక్షల పనులే జరిగాయి. రూ.60 లక్షలతో అన్నా క్యాంటీన్‌ను నిర్మిస్తుండగా.. ఇప్పటివరకు రూ.8 లక్షలు బిల్లులే మంజూరయ్యాయి. గత వైసీపీ సర్కారు సాలూరు పురపాలక సంఘ అభివృద్ధిని విస్మరించింది. అయితే కూటమి రాకతో పరిస్థితి మారింది. పనులు ఊపందుకుంటున్న సమయంలో బిల్లులు పెండింగ్‌లో ఉండిపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేస్తున్నారు. దీనిపై మున్సిపల్ డీఈ ప్రసాద్‌ను వివరణ కోరగా.. 'ఇప్పటివరకు పట్టణంలో చేసిన పనులకు బిల్లులు ఆన్‌లైన్ చేశాం. ఇంకా రూ.70 లక్షల వరకు చెల్లించాల్సి ఉంది. సీఎఫ్‌ఎంఎస్‌లో అవి పెండింగ్ ఉన్నాయి. నిధులొస్తే చెల్లింపులకు చర్యలు తీసుకుంటాం'. అని తెలిపారు.



నిర్మాణంలో ఉన్న అన్నా క్యాంటీన్ భవనం

ప్రతి ఒక్కరికీ సొంతిల్లు

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రారెడ్డి

పార్వతీపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పేదలైన ప్రతిఒక్కరికీ సొంతిల్లు ఉండా లనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలు అమలు చేస్తున్నాయని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో ఆవాస్ యోజన 2.0 పథకం అంగీకార్ అమలుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ.. గృహనిర్మాణంలో లబ్ధిదారుల స్థోమత, స్థిరత్వంపై ప్రభుత్వం దృష్టి పెడుతుందన్నారు. జిల్లాలో గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. అనంతరం వాల్‌పోస్టర్లను విడుదల చేశారు.

రంగులు మారుస్తూ.. ఆకర్షిస్తూ!

- ఇదీ పత్తి మందారం పూలు ప్రత్యేకం



ఉదయం తెల్లగా సాయంత్రం గులాబీ రంగులోకి మారిన పత్తి మందారం పూలు

సాలూరు రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సహజంగా ఊసరవెల్లి తన రంగులు మారుస్తూ ఉంటుందని అందరికీ తెలిసిందే. అయితే ఈ పువ్వు సైతం ఊసరవెల్లిలా రంగులు మార్చుతుంది. బాహినీయా వెరిగెట్టా జాతికి చెందిన ఓ మందారం పూలు సూర్యోదయం నుంచి మధ్యాహ్నం వరకు తెల్లగా ఉంటాయి. మధ్యాహ్నం 12 గంటల తర్వాత గులాబీ రంగులోకి మారుతాయి. కూనంబందవలసలో కొర్ర గంగమ్మ పెరటిలో ఉన్న పత్తి మందారం పూలు చూపరులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతంలో పత్తి మందారమనే పిలిచే వాటిని పిలుస్తారు. దీనిపై ఉద్యాన శాఖాధికారి వై.ప్రత్యూష భానును వివరణ కోరగా... 'ఆంథోసైనీ సిగ్మెంట్ సెన్సిటీవిటీ వల్ల కొన్ని పూల రంగులు ఇలా మారుతాయి. సూర్య కిరణాల వేడి అధికమయ్యేకొద్దీ సిగ్మెంట్ సెన్సిటీవిటీ వల్ల ముదురు రంగు సంతరించుకుంటుంది. ఇది పత్తి మందారం మొక్క సహజ గుణం.' అని తెలిపారు.

పీహెచ్‌సీలో వైద్యులు లేకుంటే ఎలా?

- జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

కొమరాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కొమరాడ పీహెచ్‌సీలో వైద్యులు లేకపోవడంపై జాయింట్ కలెక్టర్ యశ్వంత్ కుమార్‌రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆ సమయంలో ఇద్దరు వైద్యాధికారులు కూడా లేకపోవడంతో ఓపీ ఎవరు చూస్తున్నారని సిబ్బందిని ప్రశ్నించారు. ఒకరు మెడికల్ క్యాంపునకు, మరొకరు ట్రైనింగ్‌కు వెళ్లినట్లు వారు తెలిపారు. దీనిపై జేసీ స్పందిస్తూ.. రోగులకు ఎప్పుడూ వైద్యులు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలు, రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట కొమరాడ తహసీల్దార్ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.



వైద్య సేవలపై ఆరా తీస్తున్న జేసీ

ఘనంగా విశ్వకర్మ జయంతి 6లో

డోలీ మోతలు ఉండరాదు

- వైద్యసేవలు ప్రజలకు మరింత చేరువ కావాలి
- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎక్కడా డోలీ మోతలు ఉండరాదని, వైద్యసేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అంబులెన్స్ సర్వీస్ సేవలు అందుబాటులో ఉండాలని, కేఈఐ డాష్ బోర్డును తరచూ పర్యవేక్షించాలని సూచిం చారు. తప్పనిసరిగా గర్భిణుల వివరాలు నమోదు చేయాలని, బాల్య వివాహాలను నివారించాలని చెప్పారు. రక్తహీనతతో బాధపడుతున్న వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని, మలేరియా కేసులు తగ్గించాలని ఆదేశించారు. వైద్య పరికరాలు, మందులు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గ్రామీణా భివృద్ధి , జిల్లా నీటియాజమాన్య సంస్థల లక్ష్యాలను నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి, డీఎంహెచ్‌వో భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత వైద్య సేవలు

బెలగాం : 'స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని మహిళలందరికీ ఉచిత వైద్య సేవలు అందించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. బుధవారం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అక్టోబరు 2 వరకు మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి.. ఉచితంగా మందులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ వైశాలి, ఏఎస్పీ అంకితా సురాన, డీసీహెచ్ నాగభూషణరావు, ఐసీడీఎస్ పీడీ కనకదుర్గ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

సిరిమాను చెట్టుకు ఘనంగా పూజలు

- కొండతామరాపల్లిలో భక్తుల బారులు
- తొలి పూజ చేసిన పూజారి వెంకటరావు
- దర్శించుకున్న ప్రజాప్రతినిధులు, నాయకులు
- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్థులు



సిరిమాను చెట్టు వద్ద పూజారి వెంకటరావు, నాయకులు, గ్రామస్థులు

గంట్యాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కొండ తామరాపల్లిలో గుర్తించిన విజయనగరం పైడిమాంబ సిరిమాను చెట్టుకు బుధవారం ఘనంగా పూజలు చేశారు. పూజారి బంటుపల్లి వెంకటరావు చెట్టుకు బొట్టుపెట్టాక పూజ ఆరంభించారు. తొలుత ఆ గ్రామానికి చెందిన చల్లా అప్పలనాయుడు, నారాయణమూర్తి, రామకృష్ణ కల్లాల్లో సిరిమాను, లోకవరపు సత్యం కల్లంలో ఇరుసుమానును గుర్తించారు. వేదమంత్రోచ్చారణ మధ్య సంప్రదాయ బద్ధంగా వాటికి పూజలు నిర్వహించారు. ముందుగానే తమ గ్రామానికే పైడితల్లి పండుగ వచ్చినట్టుందని ఆ గ్రామస్థులు తెలిపారు. కాగా సిరిమాను చెట్టును గుర్తించినట్లు తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాల భక్తులు బుధవారం పెద్దఎత్తున అక్కడకి తరలివచ్చారు. ఈ పూజల్లో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు, ఆలయ సహాయ కమిషనర్ శిరీష, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

24న విజయనగరం రాక

- రూట్ మ్యాప్ ఖరారు



విజయనగరం రూరల్/ కల్చరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సిరిమానోత్సవానికి సంబంధించిన ప్రక్రియ వేగవంతం అవుతోంది. సిరిమాను, ఇరుసుమాను చెట్లను గంట్యాడ మండలం కొండ తామరాపల్లిలో గుర్తించిన నేపథ్యంలో వాటిని విజయనగరం తీసుకొచ్చేందుకు పైడిమాంబ ఆలయ అర్చకులు ముహూర్తం నిర్ణయించారు. ఈ నెల 24న ఉదయం 10 గంటల సమయంలో సిరిమాను చెట్లకు పూజలు నిర్వహించి అనంతరం విజయనగరం తీసుకురానున్నారు. దీనికి సంబంధించి రూట్‌మ్యాప్ ఖరారు చేశారు. 24న మధ్యా హ్నం 2 గంటల ప్రాంతంలో సిరిమాను, ఇరుసుమాను చెట్ల ఊరేగింపు మొదలు కానుంది. కొర్లాం, గంట్యాడ, అయ్యన్న పేట, కామాక్షినగర్, కణపాక మీదుగా విజయనగరం చేరుకుంటుంది. అక్కడి నుంచి ఆర్‌అండ్‌బీ జంక్షన్, పైడిమాంబ వనంగుడి, గంట స్తంభం, శివాల యం మీదుగా పార్కుగేటు నుంచి హుకుంపేటలో ఉన్న పూజారి వెంకటరమణ ఇంటి వద్దకు చేరుకుంటుంది. రాత్రి 10 గంటలకు చేరుకోవచ్చునని అంచనా వేశారు. ఆ తర్వాత చెట్లను సిరిమానుగా మలిచే ప్రక్రియ చేపడతారు.

చివరి అవకాశం..
కల సాకారం!

● మెగా డీఎస్సీలో ఎంపిక ● ఉపాధ్యాయులుగా కొలువు సాధన

సాలూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి)

సాలూరు మండలంలో ఖరాసవలస, పెదబోరబందకు చెందిన ఇరువురు చివరి అవకాశంలో కల సాకారం చేసుకున్నారు. మెగా డీ ఎస్సీకి ఎంపికై ఉపాధ్యాయ కొలువు సాధించారు. ఖరాసవలసకు చెందిన


లండ ప్రసాదరావు, ఖరాసవలస

లండ ప్రసాదరావు 2006లో బీఎడ్ చేశారు. 2006, 2008, 2012, 2014, 2018 డీఎస్సీలో విఫలమయ్యారు. 2019 గ్రామ సచివాలయంలో ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్‌గా కొలువు సాధించారు. ప్రస్తుతం కూర్మరాజుపేటలో పనిచేస్తున్నారు. అయితే ఉపాధ్యాయ పోస్టు సాధించాలనే తపన ఉండడంతో 2025 మెగా డీఎస్సీకి అంకిత భావంతో సాధన చేశారు. వయో పరిమితి దాటిపోతున్న తరుణంలో ఇదే చివరి అవకాశం కావడంతో కష్టపడి చదివారు. ఫలితాల్లో సోషల్ పీజీటీలో 14 వ ర్యాంకు, సోషల్ టీజీటీలో 94 వ ర్యాంకు, సోషల్ స్కూల్ అసిస్టెంట్‌లో 28వ ర్యాంకు సాధించారు. తొలుత ఆప్షన్ ఇవ్వడంతో పాఠశాల సహాయకుడు సోషల్ ఇవ్వడంతో ఆ పోస్టుకు ఎంపిక చేశారు. ఈ నెల 19న అమరావతిలో పోస్టింగ్ ఆర్డర్ తీసుకోనున్నారు.

వ్యవసాయం చేస్తూ..


గొర్ల మహేశ్వరరావు, పెదబోరబంద

సాలూరు మండలం పెదబోరబందకు చెందిన గొర్ల మహేశ్వరరావు ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్నారు. ఆయన సైతం డీఎస్సీ 2006, 2008,2012,2014, 2018 లో విఫలమయ్యారు. పణుకు వలసలో ఉన్న ప్రైవేట్ బీఎడ్,డైట్ కాలేజ్‌ల్లో అధ్యాపకుడు, ప్రిన్సిపాల్‌గా పని చేశారు. అనంతరం వాటికి స్వస్తి చెప్పి వ్యవ సాయం చేసుకుంటున్నారు. వయో పరిమితి మించి పోతున్న తరుణంలో ప్రభుత్వం ప్రకటించిన మెగా డీఎస్సీ అతనికి బంగారు అవకాశంగా మారింది. దీంతో అహర్నిశలు కష్టపడ్డారు. పాఠశాల సహాయకుడు సోషల్ స్టడిస్‌లో ఉపాధ్యాయ కొలువు సాధించారు. ఆయన ఈ నెల 19న పోస్టింగ్ ఆర్డర్ అందుకోనున్నారు.

అన్నం పెట్టలేం!



● పాత ధరలతో అసాధ్యం ● 2022 రేట్ల ప్రకారం చెల్లింపులు
● ఆవేదనలో అంగన్‌వాడీ కార్యకర్తలు

రాజాం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి)

అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతానికి కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టింది. కానీ పౌష్టికాహారానికి సంబంధించి పాత ధరలే ఉండడంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సిబ్బందికి కష్టతరంగా మారుతోంది. నాలుగు సంవత్సరాల కిందటి ధరలకు అనుగుణంగా చెల్లింపులు చేస్తోంది. దీంతో ఈ ధరలతో పౌష్టికాహారం అసాధ్యమని కేంద్రాల సిబ్బంది చెబుతున్నారు.

ఇదీ పరిస్థితి..

జిల్లాలో 11 ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో 2,499 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిలో 58,559 మంది చిన్నారులు పూర్వ ప్రాథమిక విద్యను చదువుతున్నారు. 7,159 మంది గర్భిణులు, 5,900 మంది బాలింతలు పౌష్టికాహారం పొందుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అంగన్‌వాడీ కేంద్రాల బలోపేతంపై దృష్టిపెట్టింది. మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాల్లో విలీనం చేసింది. మరోవైపు అంగన్‌వాడీ సిబ్బంది భర్తీ చేపట్టింది. తాజాగా మరికొందరు సహాయకులను నియమించేందుకు నిర్ణయించింది. పౌష్టికాహారం మెనూను సైతం మార్చింది. అక్కడ పూర్వ ప్రాథమిక విద్య చదివే చిన్నారులకు సోమవారం దోసకాయ పప్పుతో కూడిన అన్నం, మంగళవారం టమాట పప్పు, బుధవారం ఆకుకూర పప్పు, గురువారం కూరగాయాలతో సాంబారు, శుక్రవారం బీరకాయ లేదా సొర కాయ పప్పుతో కూడిన అన్నం ఇవ్వాలని సూచించింది. శనివారం అయితే వెజిటెబుల్ బాత్ రైస్‌ను మెనూగా చేర్చింది.

మూడు రెట్లు పెరిగిన ధరలు..

పాత ధరలతో ఈ మెనూ ప్రకారం ఆహారం అందించడం కష్టమని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది చెబుతున్నారు. ఇలా అయితే తాము వండి పెట్టలేమని తేల్చిచెబుతున్నారు. ఆహారం కోసం కూరగాయలు, చింతపండు, పోపులు, కారం, పసుపు అవసరం. వీటి ధర చూస్తే ఎక్కువగా ఉంటోంది. ప్రభుత్వం ఒక్కో చిన్నారికి వారానికి రూ.50 కేటాయిస్తోంది. ఇది ఎంతమాత్రం చాలడం లేదని చెబుతున్నారు. గ్యాస్‌కు నెలకు రూ.450 అందిస్తున్నారు. సిలిండర్ ధర చూస్తే రూ.900 పైగా ఉంది. అయితే ఈ ధరలన్నీ 2022 ప్రకారం ఉన్నవే. అప్పటితో పోల్చుకుంటే ధరలు రెండు, మూడింతలు పెరిగాయి. కూటమి ప్రభుత్వం గ్యాస్ బాధను తప్పించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలకు ఇంజక్షన్ ఎలక్ట్రిక్ స్టౌవ్‌లతో పాటు సామగ్రిని అందించింది. ఎటొచ్చి కూరగాయాలు, నిత్యావసరాల విషయంలో ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వం వీటి విషయంలో దృష్టిపెట్టాలని అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది కోరుతున్నారు.

● **ప్రభుత్వానికి విన్నవించాం..**

మెనూకు సంబంధించి చెల్లింపులు చాలడం లేదని అంగన్‌వాడీ సిబ్బంది నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. ఇదే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు నిర్ణయం తీసుకుంటాం. అప్పటి వరకూ కచ్చితంగా మెనూ పాటించాల్సిందే.

-కె.కనకదుర్గ, సీడీపీవో, రాజాం

ప్రస్తావించండి.. ప్లీజ్!

● జిల్లాలో పట్టాలెక్కని ప్రాజెక్టులు
● ఎమ్మెల్యేల చొరవ కోసం ఎదురుచూపులు
● నేటి నుంచి శాసనసభ సమావేశాలు

అసెంబ్లీ సమావేశాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ప్రధాన సమస్యలపై ఎమ్మెల్యేలు సభలో ప్రస్తావించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రాజెక్టులు, పరిశ్రమల ఏర్పాటు, రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాల గురించి చర్చించాలని వారు విన్నవిస్తున్నారు.

భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరుతా..



విజయనగరం జిల్లాలో కొత్తగా భారీ పరిశ్రమ ఏర్పాటు చేయాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తా. భోగాపురం ఐటీ ప్రాజెక్టునకు సంబంధించి భూ సేకరణకు అనుమతించాలని కోరుతా. విజయనగరంలో నీటి పారుదల ప్రాజెక్టులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అసెంబ్లీలో ప్రస్తావిస్తా. తోటపల్లి, గజపతినగరం కెనాల్, తారకరామ తీర్థసాగర్ శతశాతం పూర్తయ్యేందుకు వీలుగా నిధులు కేటాయించాలని కోరుతా ను. గజపతినగరం మండలం పురిటిపెంట, కోమటిపల్లి ఆర్వోబీ వంతెనల పనులు ప్రారంభించాలని కోరుతాను. గజ పతినగరం మండలం మర్రివలస, జామి మండలం శాసనా పల్లి గ్రామాల్లో వంతెనల ఏర్పాటుపై ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తాను. ఉత్తరాంధ్ర సుజల స్రవంతిపై ప్రస్తావిస్తా.

-కొండపల్లి శ్రీనివాస్, మంత్రి

సమస్యలపై ప్రత్యేక దృష్టి..



ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా. పార్వతీపురం మన్యంతో పాటు అల్లూరి సీతారామరాజు జిల్లా సమస్యలపై కూడా ప్రత్యేక దృష్టిసారించాం. పూర్ణపాడు-లాబేసు వంతెనకు నిధులు మంజూరు చేయించాం. జిల్లాలో పెద్ద ఎత్తున రహదారులను నిర్మిస్తున్నాం. ఉపాధ్యా య, కానిస్టేబుల్ పోస్టులకు ఎంపికైన వారికి మంత్రి లోకేష్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందిస్తాం.

-గుమ్మిడి సంధ్యారాణి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

సమస్యలను ప్రస్తావిస్తా..



కురుపాం నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా. అదేవిధంగా పూర్ణపాడు-లాబేసు వంతెన వేగవంతంగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరుతా. కాగా మారుమూల గిరిజన గ్రామాలపై సర్కారు ప్రత్యేక దృష్టి సారించింది. భారీగా నిధులు మంజూరు చేస్తూ.. రహదారి నిర్మాణాలు చేపడుతోంది.

-తోయక జగదీశ్వరి, ప్రభుత్వ విప్, కురుపాం

మూడు అంశాలపై మాట్లాడుతా..



చీపురుపల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): గురజాడ అప్పారావు జయంతిని ప్రతిఏటా అధికారికంగా జరిపించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం దృష్టిలో పెడతా. తోటపల్లి కుడి ప్రధాన కాలువ పూడికతీత చాలా ప్రాధాన్యత ఉన్న అంశం. వచ్చే సంక్రాంతికి ముందే కాలువ సమస్య పరిష్కరించాల్సి ఉంది. దీనిపై అసెంబ్లీ మాట్లాడతా. అదేవిధంగా భోగాపురం ఎయిర్‌పోర్టు కనెక్టివీ రోడ్డు విషయంలో కూడా ప్రభుత్వానికి ప్రతిపాదించాల్సి ఉంది. రాజాం, చీపురుపల్లి పరిసర ప్రాంతాల నుంచి నేరుగా భోగాపురం ఎయిర్ పోర్టుకు 80 అడుగుల రోడ్డు నిర్మాణం జరగాలి. దమరసింగి మీదుగా ఒకటి, చీపురుపల్లి నుంచి నేరుగా హైవేను కలిపే మరో రోడ్డును కూడా నిర్మించాలి. ఈ మూడు అంశాలపై అసెంబ్లీలో మాట్లాడుతా.

-కిమిడి కళావెంకటరావు, ఎమ్మెల్యే, చీపురుపల్లి

నదుల అనుసంధానంపై ప్రస్తావిస్తా..



అసెంబ్లీ వర్షాకాల సమావేశాల్లో నదుల అనుసంధానంపై ప్రత్యేకంగా చర్చిస్తా. వీటితో పాటు మూడు ప్రధాన సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా. అందరికీ ఇళ్లు పథకం కింద జీప్లస్ త్రీ విధానంలో నిర్మించిన ఇళ్లకు సంబంధించి కొంత మంది ఆ ఇళ్లు వద్దనుకునే వారి డిపాజిట్లు వెనక్కి ఇవ్వాలని కోరుతా. అదేవిధంగా స్పౌజ్ కోటా పింఛన్లపై ప్రస్తావిస్తా. భర్త చనిపోయి చాలా కాలం అయినా వారికి పింఛన్ అందడం లేదు. కొద్ది నెలల ముందే చనిపోయిన వారికి పింఛన్ వస్తున్నది. దీనిపై కూడా సమావేశంలో ప్రస్తావిస్తా. వీటితో పాటు నియోజకవర్గంలోని హస్తకళ నిర్మాణంపై ప్రస్తావిస్తా.

-అదితి గజపతిరాజు, ఎమ్మెల్యే, విజయనగరం

నిధులు రాబట్టేందుకు కృషి చేస్తా..



రాజాం నియోజకవర్గంలో నెలకొన్న ప్రధాన సమస్యలను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించడం ద్వారా అవసరమైన నిధులు రాబట్టేందుకు కృషి చేస్తా. రాజాం మెయిన్ రోడ్డు విస్తరణ పనులు దాదాపుగా పూర్తికావచ్చాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఆవశ్యకతను సభ దృష్టికి తీసుకువెళ్తా. నియోజకవర్గ పరిధిలోని గ్రామీణ రహదారులు, కల్వర్టు నిర్మాణాలకు నిధుల ఆవశ్యకతను ప్రస్తావిస్తా. ప్రధానంగా మడ్డువలస, తోటపల్లి ప్రోజెక్ట్ పరిధిలోని కాల్వల ఆధునికీకరణ, లైనింగ్, మరమ్మతుల పనుల కోసం నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతా. సామాజిక ఆసుపత్రిలో అత్యాధునిక సౌకర్యాల కల్పనకు నిధులు మంజూరు చేయాలని సభ దృష్టికి తీసుకువెళ్తా.

-కోండ్రు మురళీమోహన్, ఎమ్మెల్యే, రాజాం

పెండింగ్ సమస్యలను ప్రస్తావిస్తా..



బొబ్బిలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పెండింగ్ సమస్యలపై గురువారం నుంచి నిర్వహించనున్న అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. పశు సంవర్థకశాఖలో పెద్దసంఖ్యలో ఖాళీలు ఉండడంతో వాటి భర్తీకి చర్యలు తీసుకోవాలని, పాడిరైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని గతంలో ప్రభుత్వాన్ని కోరానన్నారు. ఆ అంశంపై శుక్రవారం అసెంబ్లీలో చర్చకు స్పీకరు అనుమతించారని తెలిపారు. బొబ్బిలి మండలం రాముడువలస, తెర్లాం మండలం లోచర్లలో తోటపల్లి ఎత్తిపోతల పథకాలు, పెద్దగెడ్డ జలాలను బాడంగి మండలం డొంకినవలస ప్రాంతం వరకు రప్పించడం, గొల్లాది వేగావతి నదిపై వంతెన, బొబ్బిలి పట్టణంలో ట్రాఫిక్ సమస్యను పరిష్కారానికి రోడ్ల విస్తరణ, గ్రోత్‌సెంటర్‌లో పారిశ్రామికాభివృద్ధి తదితర సమస్యలన్నింటినీ అసెంబ్లీలో ప్రస్తావిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

-బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన

జంఝావతి నీరు అందేలా..



జంఝావతి ప్రాజెక్టు ద్వారా పూర్తి స్థాయిలో తాగు, సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరుతా. దీనిపై అసెంబ్లీలో ప్రస్తావిస్తా. ఒడిశాతో ఉన్న వివాదాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తా.

-బోనెల విజయచంద్ర, ఎమ్మెల్యే, పార్వతీపురం

తోటపల్లి నుంచి నీరివ్వాలని..



పాలకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని ప్రజా సమస్యలో అసెంబ్లీలో ప్రస్తావిస్తాను. ముఖ్యంగా తోటపల్లి ప్రాజెక్టు ద్వారా ప్రతి చివరి ఎకరాకు నీరు అందించేందుకు అవసర మైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతాను. మారు మూల గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మాణాల కోసం చర్చిస్తాను. ప్రజా సమస్యలు పరిష్కరించడమే తన లక్ష్యం.

-నిమ్మక జయకృష్ణ, ఎమ్మెల్యే, పాలకొండ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల కోసం..



అసెంబ్లీ సమావేశాల్లో నియోజకవర్గంలో ఉన్న ప్రధాన సమస్యలను ప్రస్తావిస్తా. ఎస్.కోట, కొత్తవలస కోర్టు భవనాలు నిర్మించాలని, లక్కవరపుకోటలో ఉన్న మహాత్మా జ్యోతీరావు పూలే ఆశ్రమ పాఠశాలను ఇంటర్ వరకు పొడిగించాలని కోరుతా. అలాగే కొత్తవలసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు సంబంధించి ఏదైనా ఒక ప్రాజెక్ట్ ఏర్పాటు చేయాలన్న అంశాలపై ప్రస్తావిస్తా.

-కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్యే, ఎస్.కోట

తారకరామ తీర్థసాగర్‌పై ప్రస్తావిస్తా..



తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలని, త్వరితగతిన పూర్తి చేయాలని అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావిస్తా. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రతి రైతుకు నీరందించాలన్నదే మా లక్ష్యం. నియోజకవర్గంలో మత్స్యకారులకు జట్టీల నిర్మాణం చేపట్టాలని, నూతనంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరుతా. విద్య, వైద్యానికి అధిక నిధులు కేటాయించాలని కోరుతా. అలాగే నియోజకర్గంలో ప్రధాన సమస్యలన్నింటినీ అసెంబ్లీలో ప్రస్తావిస్తా.

-లోకం నాగమాధవి, ఎమ్మెల్యే, నెల్లిమర్ల

ఘనంగా విశ్వకర్మ జయంతి

విజయనగరం కలెక్టరేట్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): విరాట్ విశ్వకర్మ జయంతిని స్థానిక కలెక్టరేట్ ఆడిటోరియంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేసీ సేతుమాధవన్ పాల్గొని, విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం, శిల్పకళ, వృత్తి పరమైన నైపుణ్యాలకు విశ్వకర్మ ఆరాధన ఎంతో ప్రేరణనిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో శ్రీనివాసమూర్తి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి జ్యోతిశ్రీ, డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.


విశ్వకర్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న జేసీ సేతు మాధవన్

పార్వతీపురంలో..

పార్వతీపురం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో బుధవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత విశ్వకర్మ చిత్రపటానికి జేసీ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి పూలమాలలు వేశారు. ప్రపంచపు తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా విశ్వకర్మ పేరుగాంచారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, బీసీ సంక్షేమ శాఖ అధికారి అప్పన్న, విశ్వకర్మ సంఘాల నాయకులు, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.


చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులు అర్పిస్తున్న జేసీ

ఎస్పీ కార్యాలయంలో..

బెలగాం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీస్ కార్యాలయంలో విశ్వకర్మ జయంతి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేశారు. ప్రపంచ తొలి వాస్తుశిల్పిగా, సృష్టికర్తగా పేరుగాంచారన్నారు. పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


విశ్వకర్మ చిత్రపటానికి నివాళర్పిస్తున్న ఏఆర్ డీఎస్పీ థామస్‌రెడ్డి

ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణాను సహించం

బొబ్బిలి రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అక్రమంగా ఇసుక, గ్రావెల్ తవ్వకాలను సహించబోమని ఆర్డీవో రామ్మోహన రావు హెచ్చరించారు. ఇసుక, గ్రావెల్ అక్రమంగా తవ్వినా, రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం సాయంత్రం, స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక అక్రమ రవాణాతో పట్టుబడ్డ ట్రాక్టర్ల యజమానులను హెచ్చరించారు. కొన్ని నెలలుగా జరుగుతున్న ఈ ఇసుక అక్రమ రవాణాపై నిఘా పెట్టామన్నారు. బుధవారం చేపట్టిన ఆకస్మిక దాడుల్లో 11 ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నామన్నామన్నారు. భవిష్యత్తులో మరోసారి దొరికితే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని యజమానులకు హెచ్చరించారు. ప్రస్తుతానికి జరిమానాలతో సరిపెడుతున్నామని మరోసారి పట్టుబడితే ట్రాక్టర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.


ట్రాక్టర్ల యజమానులతో మాట్లాడుతున్న ఆర్డీవో

మా పరిస్థితేంటి?

● గిరిజన గురుకుల ఔట్ సోర్సింగ్ టీచర్ల భవిష్యత్‌పై నీలినీడలు ● గత 22 ఏళ్లుగా సేవలందిస్తున్న వైనం
● కొత్త మాస్టార్ల రాకతో ఉద్యోగ భద్రతపై సందేహాలు ● రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని విన్నపం

గుమ్మలక్ష్మీపురం,సెప్టెంబరు17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన గురుకుల ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయుల భవిష్యత్‌పై నీలినీడలు అలుముకున్నాయి. మెగా డీస్సీలో ఎంపికైన కొత్త మాస్టార్లు వస్తుండడంతో వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గత 22 ఏళ్లగా సేవలందిస్తున్న తమకు ఉద్యోగ భద్రత కల్పించి.. కూటమి ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

2003 నుంచి విధులు..

● జిల్లాలో పది గిరిజన గురుకుల పాఠశాల, కళాశాలలు ఉన్నాయి. వీటిల్లో సుమారు 116 ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 2003లో గెస్ట్ ప్రాతిపదికన వారు విధుల్లో చేరారు. అప్పట్లో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన డెమో, టెస్టుల్లో ప్రతిభ చూపి పోస్టులకు ఎంపికయ్యారు. కాగా ఆ తర్వాత అప్పటి టీడీపీ ప్రభుత్వం ఆప్కోస్ అనే సంస్థ ద్వారా వారిని ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులుగా కొనసాగిం చింది. అయితే ఎప్పటికైనా కాంట్రాక్ట్ రెసిడెంట్ ఉపాధ్యాయులగానో, మినిమం టైం స్కేల్ ప్రాతిపదికనో ఉద్యోగ భద్రత కల్పిస్తారని వారు భావించారు. అయితే మెగా డీఎస్సీలో కనీసం పది, 20 మార్కులు కూడా కలపకుండా పోస్టులను భర్తీ చేయడంపై ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. వయసు దాటిపోయిన కార ణంగా కొంతమంది డీఎస్సీ కూడా రాయలేకపోయారని, మొత్తంగా తమ పరిస్థితేం టని వారు ప్రశ్నిస్తున్నారు.

● నిబంధనల మేరకు నోటిఫికేషన్ ఇచ్చి ప్రత్యేక ప్రాతిపదికన గిరిజన గురుకుల కళాశాలలు, పాఠశాలల్లో పోస్టులన్నింటినీ భర్తీ చేయాల్సి ఉంది. అయితే అవేవీ పాటించకపోవడంపై ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల మేరకు మంత్రులు లోకేష్, సంధ్యారాణి దీనిపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

● 'గత 22 ఏళ్లుగా గురుకుల పాఠశాలకు గెస్ట్‌టీచర్లుగా పనిచేస్తున్నాం. మా స్థానంలో రెగ్యులర్ ఉపాధ్యాయులను నియమిస్తే మా పరిస్థితేంటి? కుటుంబాలతో రోడ్డున పడతాం. ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.' అని ఉపాధ్యాయ సంఘ నాయకుడు బాలన్న కోరారు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా.. ఈ అంశంపై ఉన్నతాధికారుల నుంచి ఇంకా ఎటువంటి ఆదేశాలు రాలేదని తెలిపారు.



భద్రగిరిలో గిరిజన బాలికల గురుకుల పాఠశాల

వైభవంగా రామస్వామి పవిత్రోత్సవాలు

నెల్లిమర్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో రామస్వామి పవిత్రోత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. మొదటిరోజు బాలభోగం, తీర్థగోష్టి, యాగశాలలో విష్వక్సేన ఆరాధన నిర్వహించారు. శ్రీమద్రామాయణ పారాయణం, సుందరకాండ పారాయణం, దివ్యప్రబంద సేవాకాలం నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. స్వామివారికి పుష్పాలతో అలంకరించి, ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాసరావు, ప్రధాన అర్చకుడు సాయిరాం ఆచార్యులు, అర్చకుడు కిరణ్, సీనియర్ అసిస్టెంట్ రామారావు పాల్గొన్నారు.


రామతీర్థంలో పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

నేడు బార్లకు లాటరీ

విజయనగరం క్రైం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన బార్ పాలసీ(2025-28)కిగాను జిల్లాలో ఖాళీగా ఉన్న బార్లకు బుధవారం సాయంత్రంతో దరఖాస్తు స్వీకరణ ముగిసింది. గురువారం ఓపెన్ కేటగిరికి సంబంధించిన బార్లకు స్థానిక కలెక్టర్ ఆడిటోరియంలో కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిలో ఎంపిక జరగనుంది. ఈ విషయాన్ని దరఖాస్తుదారులు గమనించాలని జిల్లా ఎక్సైజ్ అధికారి బి.శ్రీనాధుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఓపెన్ కేటగిరి నాలుగు బార్లుకు గాను 16 దరఖాస్తులు వచ్చాయని, మొత్తం రూ.81.6లక్షలు డీడీల రూపంలో వచ్చాయని చెప్పారు.

వసతిగృహం తనిఖీ

నెల్లిమర్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్లలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని జిల్లా న్యాయాధికారి ఎ.భవిత బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో సమావేశమై, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ కె.శ్రీకాంత్, ఎంపీడీవో కార్యాలయ ఏవో పి.సుదర్శనం, వసతి గృహ సంక్షేమాధికారి చంద్రునాయుడు పాల్గొన్నారు.

రిసోర్స్ పర్సన్ల ఎంపిక

నెల్లిమర్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నూతన ఉపాధ్యాయుల శిక్షణ కోసం రాష్ట్ర స్థాయి రిసోర్స్ పర్సన్లుగా జిల్లా నుంచి గణితం సబ్జెక్టుకు జరజాపుపేట ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్య, సరిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు సత్యనారాయణ ఎంపికయ్యారు. వీరికి అమరావతిలో 3 రోజులపాటు విట్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో శిక్షణా కార్యక్రమం ఉంటుంది. ఇందుకోసం వీరు అమరావతి బయలుదేరి వెళ్లారు.

రెజ్లింగ్ పోటీలకు శ్రీరాంనగర్ విద్యార్థులు

గరివిడి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): కొండవెలగాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి కుస్తీ పోటీల్లో గరివిడిలోని శ్రీరాంనగర్ ఉన్నత పాఠశాలకు చెందిన 16మంది విద్యార్థులు ప్రతిభ కనబరిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిని హెచ్ఎం ఎం.నిర్మల, పీఈటీ ఎం.ఉదయ్‌కుమార్ అభినందించారు.

పేదల కోసం 'పీఎం ఆవాస్ యోజన'

రాజాం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పీఎం ఆవాస్ యోజన అర్బన్ 2.0 కార్యక్రమానికి సంబంధించి బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ ఈఈ రత్నకర్, కమిషనర్ జె.రామప్పలనాయుడు బ్రోచర్ ఆవిష్కరించారు. అర్హులైన పేదలందరికీ ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఏఈ బి.దుర్గారావు, సీఎల్‌టీసీ ఎస్‌వీ రమణ, తదితరులు పాల్గొన్నారు.

హామీని అమలు చేయాలి

రాజాం రూరల్, సెప్టెంబరు (ఆంధ్రజ్యోతి): ఆశ వర్కర్లకు వేతనాల పెంపు హామీని కూటమి ప్రభుత్వం అమలు చేయాలని ఆ యూనియన్ గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆశ వర్కర్లతో కలిసి రాజాంలో సమావేశం ఏర్పాటుచేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వడంతో పాటు సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు.

సీఎంఆర్ఎఫ్ పంపిణీ

భోగాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ముంజేరులోని జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం రూ.1.99లక్షల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే లోకం నాగమాధవి లబ్ధిదారులకు అందజేశారు. డెంకాడ మండలం గొలగాం గ్రామానికి చెందిన ఎం.శ్వేత, పూసపాటిరేగ మండలం గోవిందపురానికి చెందిన ఎ.ఉషాతేజస్విని, పోలిపల్లికి చెందిన వై.అజయ్‌కుమార్‌లకు ఈ చెక్కులను అందజేశారు. ● చీపురుపల్లి: సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.10.86 విలువ గల చెక్కులను స్థానిక టీడీపీ కార్యాలయంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు బుధవారం లబ్ధిదారులకు అందజేశారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థిక బకాయిలు చెల్లించాలి

భోగాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల ఆర్థిక బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఈశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం భోగాపురంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. సుమారు రూ.30కోట్లు ఆర్థిక బకాయిలు ఉన్నాయన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్వీ పైడిరాజు, జిల్లా కార్యదర్శి శరత్ కుమార్, మండల అధ్యక్షుడు పి.పార్వతీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తీరంలో స్వచ్ఛ సాగర్

పూసపాటిరేగ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చింతపల్లి సముద్ర తీరంలో బుధవారం ఐఎన్‌సీవోఐఎస్(హైదరాబాద్) ఆధ్వర్యంలో స్వచ్ఛసాగర్ సురక్షిత సాగర్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా తీరంలో ప్లాస్టిక్ వ్యర్థాలు, తదితర వ్యర్థాలను తొలగించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంక్షేమ సమితి, కోస్టల్ సెక్యూరిటీ, విద్యార్థులు పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితుల నిరసన

ఎస్.కోట రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): జిందాల్ నిర్వాసితుల పక్షాన కలెక్టర్ నిలవాలను వారు కోరారు. బుధవారం బొడ్డవర గ్రామం వద్ద ఏపీ రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. జిందాల్ చేస్తున్న భూ దోపిడీని ఆపాలని నినాదాలు చేశారు.

ఉచితంగా ఆయిల్‌పామ్ మొక్కలు

భోగాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రైతులకు ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలు అందజేస్తామని ఉద్యానశాఖ అధికారిణి బి.ఉమాభరణి అన్నారు. ముంజేరులో బుధవారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పతంజలి కంపెనీ వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి రైతులకు ఉచితంగా మొక్కలు అందజేస్తుందని చెప్పారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం



నెల్లిమర్ల: మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగమాధవి



ఎల్.కోట: పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

మహిళల ఆరోగ్య సంరక్షణే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని ఎమ్మెల్యేలు అన్నారు. స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలను వారు బుధవారం ప్రారంభించారు. ● నెల్లిమర్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే లోకం నాగమాధవి బుధవారం ప్రారంభించారు. ఈనెల 17 నుంచి వచ్చే నెల 2 వరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో ఆరోగ్య శిబిరాలు జరగనున్నాయని ఎమ్మెల్యే వివరించారు. నగర పంచాయతీ చైర్మన్ బంగారు సరోజిని, మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్లు మజ్జి రాంబాబు, దుర్గాశేఖర్, ఎంఎం నాయుడు పాల్గొన్నారు. ● భోగాపురం: ప్రతి స్త్రీ ఆరోగ్యపరంగా బలంగా ఉండాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. భోగాపురం సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. తహసీల్దార్ రమణమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో గాయత్రి తదితరులు పాల్గొన్నారు. ● లక్కవరపుకోట: మహిళల ఆరోగ్యమే దేశానికి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే లలిత కుమారి అన్నారు. ఎల్.కోట పీహెచ్‌సీలో వైద్యుడు బి.అనీల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమాన్ని ఆమె బుధవారం ప్రారంభించారు. మహిళల ఆరోగ్యం పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రద్ధ తీసుకుంటున్నాయని తెలిపారు. త్వరలో రూ.25 లక్షలఆరోగ్య బీమా అందుతుందని పేర్కొన్నారు. వైద్యుడు అజయ్‌కుమార్, ఏఎంసీ చైర్మన్ చొక్కాకుల మల్లునాయుడు, ఒబ్బిని సత్యనారాయణ, డైరెక్టర్ కళ్లద్దాల శ్రీను, కొట్యాడ రాము, ఇన్‌చార్జి ఎంపీడీవో దొర తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి

రాజాం/ రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాజాం కస్పా వీధిలో గురువారం విశ్వబ్రాహ్మణ సొసైటీ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కోండ్రు జగదీష్ పాల్గొన్నారు. విశ్వబ్రాహ్మణ సొసైటీ అధ్యక్షుడు ముగడ శ్రీనివాస్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు నంది సూర్యప్రకాష్‌రావు పాల్గొన్నారు. కమిటీ అధ్యక్షుడు ముగడ శ్రీనివాసరావు, సభ్యుల సారథ్యంలో అన్నదానం ఏర్పాటుచేశారు.

● భోగాపురం: భోగాపురం మార్కెట్ సమీపంలో విశ్వబ్రాహ్మణులు బుధవారం విశ్వకర్మ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ మండల అధ్యక్షుడు పోలవరపు ప్రకాశ్, కుప్పిలి తదితరులు పాల్గొన్నారు. ● చీపురుపల్లి: విరాట్ విశ్వకర్మ జయంతి ఉత్సవాలు బుధవారం పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్ర, ఓంకారం, స్వామి సుప్రభాత సేవలు నిర్వహించారు.



రాజాంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

గురజాడకు తగిన గౌరవం లభించాలి



నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నేతలు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మహాకవి గురజాడ అప్పారావుకు తగిన గౌరవం లభించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండుగగా నిర్వహించాలని కోరుతూ పలువురు ప్రజా సంఘాల నేతలతో కలిసి ఆయన స్థానిక గురజాడ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో సంఘ నేతలు జక్కు రామకృష్ణ, దవడ కొండబాబు, మీనా, చిరంజీవి, చీకటి దివాకర్, డాక్టరు వెంకటేశ్వరరావు, బీఏ రావు, దవళ సర్వేశ్వరరావులు పాల్గొన్నారు.

● రాజాం రూరల్: మహాకవి గురజాడ అప్పారావు జయంతిని రాష్ట్ర పండుగగా నిర్వహించాలని జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజాంలో జేవీవీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. ఈనెల 21న జేవీవీ ఆధ్వర్యంలో రాజాంలోని విద్యానికేతన్ పాఠశాలలో గురజాడ జయంతోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆయన ప్రకటించారు.

ఏఎంసీ పూర్వ వైభవానికి కృషి



మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ నర్సింగరావు

విజయనగరం రూరల్, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ పూర్వ వైభవానికి కృషి చేస్తానని ఏఎంసీ చైర్మన్ కర్రోతు నర్సింగరావు అన్నారు. ఏఎంసీ తొలి పాలకవర్గ సమావేశం చైర్మన్ చాంబర్‌లో బుధవారం నిర్వహించారు. ఏఎంసీ ప్రత్యేక కార్యదర్శి బి.భారతి నివేదిక చదివి వినిపించారు. మార్కెట్ కమిటీ సమాచారాన్ని, ఆదాయ, వ్యయాలను వివరించారు. ఈసందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఏఎంసీ అభివృద్ధికి కట్టుబడి ఉందామని పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే అదితి గజపతిరాజు సలహాలు, సూచనలతో మార్కెట్ కమిటీ మరింత ముందుకు తీసుకు వెళ్దామన్నారు. ఎరువులు, యూరియా అమ్మకాలను వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా నిర్వహించేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఏఎంసీ చైర్మన్.. వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులకు సూచించారు. మార్కెట్ కమిటీ అంతా సోలార్ విద్యుత్ వినియోగం చేయాలన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రినాయుడు, గాజులరేగ పీఏసీఎస్ అధ్యక్షుడు కోరాడ వెంకటరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధికారులు కె.జ్యోత్స్న, ఎం.సంతోష్‌కుమార్‌తో పాటు, మార్కెట్ కమిటీ డైరక్టర్లు పాల్గొన్నారు. యూరియా అమ్మకాలపై ఏఎంసీ చైర్మన్.. మార్క్‌ఫెడ్ చైర్మన్, అధికారులతో మాట్లాడారు.

20న రామనారాయణంలో శంఖారావం

విజయనగరం రింగురోడ్డు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం రామనారాయణంలో ఈనెల 20న రామాయణ శంఖారావం కార్యక్రమంలో భాగంగా జాతీయ స్థాయిలో లీగల్ కాన్‌క్లేవ్‌ని నిర్వహిస్తున్నామని ఎన్‌సీఎస్ చారిటబుల్ ట్రస్టు ఫౌండర్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ తెలిపారు. రామనారాయణంలో బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 20న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ వాల్మీకి రీసెర్చ్ సెంటర్‌లో ఏర్పాటుచేయనున్న సదస్సులో తెలంగాణ హైకోర్టుకి చెందిన జస్టిస్ కె.లక్ష్మణ్, జస్టిస్ టి.మాధవిదేవి, జస్టిస్ ఎస్.నంద, తిరుపతి జాతీయ సాంస్కృతి విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ జీఎస్సార్ కృష్ణమూర్తి, నేషనల్ లా యూనివర్సిటీ ఉప కులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాష్‌రావు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో వాల్మీకి రీసెర్చ్ సెంటర్ డైరెక్టర్ హెచ్.లజపతిరాయ్, కో-ఆర్డినేటర్ నారాయణం గౌరీనిత్యా, తవాస్మీ అకాడమీ శ్రీరామ చక్రధర్, డైరెక్టర్లు శారదా దీప్తి, జాహ్నవిరెడ్డి, మేనేజరు శ్రీనివాసరాజు పాల్గొన్నారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు.

అధికారులపై రైతుల ఆగ్రహం

గుర్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మండలంలోని వల్లాపురం, గుర్ల గ్రామాల్లో బుధవారం యూరియా పంపిణీ చేశారు. అయితే వల్లపురంలో 10 యూరియా బస్తాలను ఒకరే పట్టుకుపోవడంతో అధికార, ప్రతిపక్ష నాయకుల మధ్య వివాదం ఏర్పడింది. దీంతో ఎస్ఐ నారాయణరావు, తహసీల్దార్ ఆదిలక్ష్మి చేరుకుని, పరిస్థితిని పరిశీలించారు. రైతులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. అనంతరం రోడ్డుపై బైఠాయించారు. కొంతసేపటికి సమస్య సద్దుమనిగింది. దీంతో అధికారులు రైతులకు యూరియా పంపిణీ చేసి, అక్కడి నుంచి వెళ్లిపోయారు. అదే విధంగా గుర్లలో కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు యూరియా కోసం రైతులు కాపలా కాశారు. ఏవో తిరుపతిరావు సెలవు పెట్టడంతో అక్కడ గ్రామ సచివాలయంలో పనిచేసే అధికారులపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఘనంగా డివిజన్ స్థాయి క్రీడా పోటీలు

రేగిడి, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ఏపీపురం ఉన్నత పాఠశాలలో అండర్-14 డివిజన్ స్థాయి క్రీడా పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ పోటీలను ఎంపీపీ దార అప్పలనరసమ్మ, రేగిడి, వంగర ఎంఈవోలు వరప్రసాదరావు, బి.ఎరకయ్య, కూరిమినాయుడు ప్రారంభించారు. రాజాం, పాలకొండ నియోజకవర్గాలకు సంబంధించి 8 మండలాలకు చెందిన 800 మంది విద్యార్థులు పోటీపడ్డారు. విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు.

మోదీ ఫ్లెక్సీల తొలగింపుపై నిరసన



నిరసన చేస్తున్న బీజేపీ నాయకులు

విజయనగరం దాసన్నపేట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ పుట్టినరోజు సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఫ్లెక్సీలను నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య ఆదేశాలతో అధికారులు తొలగించారు. దీనిపై బీజేపీ నాయకులు, కార్యకర్తలు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. పుట్టిన రోజు నాడే ఫ్లెక్సీలను తొలగించడం అన్యాయమని, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ ధ్వజమెత్తారు. కమిషనర్ నల్లనయ్య తన వైఖరిని మార్చుకోవాలన్నారు.

ఘనంగా మోదీ పుట్టినరోజు వేడుకలు



గరివిడి: రక్తదాతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్‌నాయుడు

విజయనగరం దాసన్నపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ జిల్లా కార్యాలయంలో సేవా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం రోటరీ క్లబ్, ఎన్‌వీఎన్ బ్లడ్ బ్యాంకు సహాయంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 125 మంది స్వచ్ఛందంగా వచ్చి రక్తదానం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ, పార్టీ నాయకులు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి, నారాయణరావు, పాకా రాణి, నాగమల్లి, పతివాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ● గరివిడి: ప్రధానమంత్రి నరేంద్రమోదీ పుట్టినరోజు సందర్భంగా బీజేపీ నాయకుడు మణిపూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక బీజేపీ నాయకులు, పలు కళాశాలల విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొని, రక్తదానం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

భోగాపురం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): అర్జీదారులు ఇచ్చిన వినతుల ప్రకారం అన్ని సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్, టీడీపీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు అన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో ఆయన పాల్గొని, వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సమస్యలు సంబంధిత శాఖ అధికారులకు తెలియజేసి, పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు.

జిందాల్ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదం

శృంగవరపుకోట, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): గ్రామ సభల ద్వారా జిందాల్ భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు తీర్మానాలు చేయాలని ఎస్.కోట మండల పరిషత్ సభ్యులు ఆమోదం తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెదఖండేపల్లి ఎంపీటీసీ బోదల దేముడు మాట్లాడుతూ జిందాల్ యాజమాన్యానికి ఇచ్చిన భూముల్లో గ్రామ సభలను నిర్వహించి ప్రజల సమ్మతితో పరిశ్రమలను ఏర్పాటు చేయాలని సభ దృష్టికి తీసుకువచ్చారు. అధ్యక్ష స్థానంలో ఉన్న ఎంపీపీ సండి సోమేశ్వరరావు దీనిని ప్రతిపాదించారు. దీనికి మద్దతుగా సమావేశానికి హాజరైన ఎంపీటీసీలంతా ఆమోదిస్తున్నట్టు చేతులెత్తారు. జిందాల్ యాజమాన్యానికి అనుకూలంగా వ్యవహరించేందుకు జిల్లా అధికారులు పంచాయితీ కార్యదర్శులను బదిలీ చేయడాన్ని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తప్పుపట్టారు. జిందాల్ భూ నిర్వాసితుల సమస్యలపై ప్రత్యేకంగా ప్రస్తావించారు. అనంతరం యూరియా కొరతపై పలువురు ప్రస్తావించారు. దీనిపై ఏవో కె.రవీంద్ర మాట్లాడుతూ మొదటి విడతలో రైతులందరికీ యూరియా అందిందని తెలిపారు. రెండో విడత పంపిణీ చేస్తామని, 24 టన్నుల యూరియా సిద్ధంగా ఉందని, మరో 100 టన్నుల యూరియా రానుందని తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ నుంచి సమావేశానికి ఎవరూ హాజరు కాకపోవడంపై ఎంపీపీ అభ్యంతరం తెలిపారు. ఈవోపీఆర్డీ వీవీ లక్ష్మి, వైస్ ఎంపీపీ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

ఆటో యూనియన్ల బంద్ ప్రశాంతం



విజయనగరంలో నిరసన చేస్తున్న ఆటో కార్మికులు

విజయనగరం దాసన్నపేట, జూలై 17(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆటో యూనియన్, కార్మికుల బంద్ బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఏఐఎఫ్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వెయ్యిమంది ఆటో డ్రైవర్లు స్థానిక కోట జంక్షన్ నుంచి మూడు లాంతర్లు, అంబేడ్కర్ జంక్షన్ కాంప్లెక్స్ మీదుగా మయూరి కూడలికి చేరుకుని మానవహారం చేపట్టారు. ఈసందర్భంగా ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు గణేష్ పండా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఆటో కార్మికులు వీధిన పడ్డారన్నారు. తక్షణమే ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ● చీపురుపల్లి: పట్టణానికి చెందిన ఆటో డ్రైవర్లు బుధవారం మెయిన్ రోడ్డులో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ప్రతినిధి అంబల్ల గౌరినాయుడు, ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ● నెల్లిమర్ల: ఆటో రంగ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని సీఐటీయూ నాయకుడు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం స్థానిక ఆటో కార్మికులు జరజాపుపేట, మొయిద జంక్షన్, రామతీర్థంలో బంద్ పాటించారు. ఆటో కార్మికులకు రూ.25వేలు ఇవ్వడంతో పాటు ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు.

గుజరాత్‌లో జిల్లా మత్స్యకారుడి మృతి



రాముడు (ఫైల్)

పూసపాటిరేగ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): చింతపల్లి గ్రామానికి చెందిన బడి రాముడు(44) అనే మత్స్యకారుడు గుజరాత్ రాష్ట్రం వీరావల్‌లో సముద్రంలో వేట సాగిస్తూ బుధవారం మృతిచెందాడు. రాముడు జీవనోపాధి నిమిత్తం అక్కడకు వేటకు వెళ్లాడు. అయితే అక్కడ సముద్రంలో వేట సాగిస్తూ ప్రమాదవశాత్తు మృతిచెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం చింతపల్లికి తీసుకొస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

నదిలో మునిగిపోయిన నాటుబండి

● రెండు ఎద్దుల మృతి.. ప్రాణాలతో బయటపడ్డ రైతు

సీతానగరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): నదిలో నుంచి పొలానికి వెళుతున్న సమయంలో నాటు బండితో సహా రెండు ఎద్దులు నీట మునిగాయి. బండిపై ఉన్న రైతు ప్రాణాల నుంచి బయటపడ్డాడు. ఈ ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానిక శివాలయం దగ్గర సువర్ణముఖి నది ఒడ్డున సామంతల శ్రీనివాసరావు నివాసం ఉంటున్నాడు. ఆయనకు ఎకరా పొలం ఉంది. ఎప్పటిలాగే తన ఎద్దుల బండితో బుధవారం సువర్ణముఖి నదికి ఆవల ఉన్న పొలంలో పనిచేయడానికి వెళ్లాడు. అయితే ఇటీవల ఎగువ ప్రాంతాలకు వర్షాలు కురవడంతో నదిలో ఉండే పెద్ద గోతులను గమనించలేదు. రెండు ఎద్దులు నాటు బండితో పాటు నేరుగా గోతిలో దిగబడి మునిగిపోయాయి. అప్రమత్తమైన రైతు శ్రీనివాసరావు బండి బీద నుంచి దిగి ముందుకు గెంతేసి ప్రాణాలను రక్షించుకున్నాడు. రైతు చూస్తుండగానే రూ.2 లక్షలు విలువైన ఎద్దులు నదిలో మునిగి ప్రాణాలు కోల్పోయాయి. అక్కడే ఉన్న స్థానికులు వెంటనే రైతు శ్రీనివాసరావును రక్షించి బయటకు తీసుకువచ్చారు. ట్రాక్టరు తీసుకువచ్చి ఎద్దులను, టైరుబండిని బయటకు తీశారు.

షాపింగ్ కాంప్లెక్సులో అగ్ని ప్రమాదం

● రూ.లక్ష ఆస్తి నష్టం

కొత్తవలస, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): తుమ్మికాపల్లి పరిధిలోని కొత్తవలస-ఎస్.కోట రోడ్డులో ఉన్న సాయిలక్ష్మి కాంప్లెక్సులో గల ఒక షాపులో బుధవారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో రూ.లక్ష విలువగల ఎలక్ట్రానిక్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. ఈ కాంప్లెక్సులోని ఎలక్ట్రానిక్ ఉపకరణాలు విక్రయించే దుకాణం నుంచి మంటలు రాగా, స్థానికులు గమనించి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అగ్నిమాపక సిబ్బంది వచ్చి, మంటలను అదుపు చేశారు. అప్పటికే షాపులోని నాలుగు రిఫ్రిజరేటర్లు, 3 వాషింగ్ మిషన్లు కాలిపోయాయి. వీటి విలువ సుమారు లక్ష రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. షార్టు సర్క్యూట్ కారణంగానే ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు

పాచిపెంట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పి.కోనవలస సమీపంలో బుధవారం ఆటో బోల్తా పడిన ఘటనలో ఇద్దరు గాయాలపాలయ్యారు. డ్రైవర్ అజాగ్రత్త కారణంగా ఎదురుగా వస్తున్న లారీ బంపర్‌ను ఢీకొనడంతో ఆటో బోల్తా పడింది. ఈ మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ కె.వెంకట సురేష్ తెలిపారు.

పీడీఎస్ బియ్యం సీజ్

సాలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెదబజారులో అక్రమంగా తరలిస్తున్న 981 కిలోల రేషన్ బియ్యాన్ని బుధవారం సీజ్ చేసినట్లు పట్టణ సీఐ బి.అప్పలనాయుడు తెలిపారు. పట్టణంలో పెదబజారులో గంట చందు, మంద కామేశ్వరరావుల నుంచి 49 బస్తాల బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసి రెవెన్యూ అధికారుకు అప్పగించామని వివరించారు.

మహిళల భద్రతే ప్రధాన లక్ష్యం

● ఏఎస్పీ సౌమ్యలత



మాట్లాడుతున్న ఏఎస్పీ సౌమ్యలత

విజయనగరం క్రైం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మహిళలు, బాలికల భద్రతే ప్రధాన లక్ష్యంగా జిల్లా పోలీసు శాఖ పనిచేస్తోందని జిల్లా అదనపు ఎస్పీ సౌమ్యలత అన్నారు. నగర శివార్లలోని కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయంలో బుధవారం లైంగిక వేధింపులు, మహిళల భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. మహిళల మొబైల్ ఫోన్లలో శక్తి యాప్ నిక్షిప్తం అయి ఉంటే ఆపద సమయంలో రక్షణగా ఉంటుందన్నారు. యువత గంజాయి, మత్తు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. వైస్ చాన్సలర్ శ్రీనివాసన్ మాట్లాడుతూ కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం ఎల్లప్పుడూ, సురక్షితమైన గౌరవప్రదమైన విద్యా వాతావరణానికి కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ జితేంద్రమోహన్ మిశ్రా, యూనివర్సిటీ కమిటీ చైర్మన్ పి.శ్రీదేవి, ఏవో డా.సూర్యనారాయణ, సీఐ శ్రీనివాసరావు, ఎం.శరత్‌చంద్ర, శంకర్‌రెడ్డి, అనిరుధ్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

కొత్తవలస, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పని విషయంలో అలక్ష్యం వహిస్తే సహించేది లేదని డ్వామా పీడీ శారదాదేవి హెచ్చరించారు. మండలంలో 2024-25 సంవత్సరంలో చేపట్టిన ఉపాధి పనులపై మంగళవారం కొత్తవలసలో సామాజిక తనిఖీ నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో అవకతవకలను గుర్తించిన ఆమె.. సుతిమెత్తగా హెచ్చరికలు చేశారు. కొన్ని గ్రామాలకు సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్లలకు, టెక్నికల్ అసిస్టెంట్లలకు, కంప్యూటర్ ఆపరేటర్లుకు రూ.500 నుంచి రూ.2,500 వరకు జరిమానాలు విధించారు. మండలంలో గత సంవత్సరానికి గాను 25 పంచాయతీలలో సుమారు రూ.21కోట్ల విలువ గల పనులు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రమణయ్య, ఏపీడీ పద్మజ, ఏపీవో జనార్దనరావు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ విజేతలకు అభినందనలు

నెల్లిమర్ల, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బీబీఏ చదువుతున్న వెయిట్ లిఫ్టింగ్ విజేతలు శ్రీపాద శ్రీజ, బి.మౌనిక, వకీల్ సహస్రలను ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ మార్క్ లామీ అభినందించారు. ఇటీవల సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఖేలో ఇండియా అస్మిత వెయిట్ లిఫ్టింగ్ లీగ్-2025-26 పోటీల్లో సెంచూరియన్ విద్యార్థులు 8 బంగారు పతకాలు కైవసం చేసుకున్నారు. ఈసందర్భంగా వారిని ఆయన బుధవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ డీఎన్.రావు, చాన్సలర్ జీఎస్ఎన్.రాజు, వైస్ చాన్సలర్ ప్రశాంతకుమార్ మహంతి, రిజిస్ట్రార్ పల్లవి పాల్గొన్నారు.

గిరిజనుల బతుకులు నాశనం చేయొద్దు

వేపాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మారిక గిరిజనుల బతుకులను జల సమాధి చేయవద్దని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సాధారణ సమావేశంలో ఆయన పాల్గొని, ప్రసంగించారు. అదానీ పవర్ ప్లాంటు కోసం గిరిజనుల బతుకులను నాశనం చేయడానికి ప్రభుత్వం పూనుకోవడం అన్యాయమన్నారు. అనంతరం బానాది గ్రామ సర్పంచ్ కర్రి యశోద మాట్లాడుతూ సచివాలయ కార్యదర్శి మూర్తి తనను అసభ్యకరంగా తిడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సూర్యనారాయణ, అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

పాత స్టేషనరీని వాడితే చర్యలు

మెంటాడ, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): మీసేవ కేంద్రాల్లో పాత స్టేషనరీని వినియోగిస్తే అటువంటి సెంటర్లను సీజ్ చేస్తామని, నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని మీసేవ కేంద్రాల జిల్లా పర్యవేక్షకుడు శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన జిల్లాలోని అన్ని మీసేవ కేంద్రాల ఆపరేటర్లకు బుధవారం వాట్సాప్ సందేశం పంపారు. జిల్లాలోని కొన్ని కేంద్రాల్లో జగన్మోహన్ రెడ్డి ఫోటోతో ఉన్న స్టేషనరీని వినియోగిస్తున్న వైనంపై 'ఇంకా మారలే' శీర్షికతో బుధవారం ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమయ్యింది. దీనిపై జేసీ సేతు మాధవన్ స్పందించారు. ఆయన ఆదేశాలతో శ్రావణ్‌కుమార్ ఈ సందేశాన్ని విడుదల చేశారు. తక్షణమే పాత స్టేషనరీని పక్కన పెట్టాలని నిర్వాహకులకు ఆదేశించారు. అలాగే స్థానిక తహసీల్దార్ అరుణకుమారి మెంటాడలోని మీసేవ కేంద్రాలను తనిఖీ చేశారు. పాత స్టేషనరీని వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎంపీడీవోగా ఆనందరావు

రాజాం, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): రాజాం ఎంపీడీవోగా జె.ఆనందరావు గురువారం బాధ్యతలు చేపట్టారు. కోటబొమ్మాళి మండల డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన ఆనందరావు పదోన్నతిపై ఇక్కడు వచ్చారు. ఇంతవరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పనిచేసిన వి.శ్రీనివాసరావు డిప్యూటీ ఎంపీడీవోగా కొనసాగుతారు.

ప్రస్తావించండి.. ప్లీజ్!

(5వ పేజీ తరువాయి)

ఇరిగేషన్ ఏర్పాటు చేస్తే వేలాది ఎకరాలకు నీరు అందుతుంది.

- గిరిజన గర్భిణుల వసతిగృహాల్లో సేవలందిస్తున్న సిబ్బందికి కొన్ని నెలలుగా బకాయి ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలి.
- పార్వతీపురం, సీతంపేటలో నిర్మిస్తున్న మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి భవనాలపై దృష్టి సారించాల్సి ఉంది. జిల్లా కేంద్ర ఆసుప్రతితో పాటు సీతంపేట, పాలకొండ, సాలూరు ఏరియా ఆసుప్రతుల్లో గుండె, ఇతర ప్రత్యేక వైద్య నిపుణులను నియమించాలి.
- జిల్లాలో కలెక్టరేట్‌తో పాటు ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు సమకూర్చాలి. అనేక శాఖలకు ఉన్నతాధికారులను నియమించాలి.
- జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో సుమారు 300పైగా రహదారులను నిర్మించాల్సి ఉంది. అటవీశాఖతో ఉన్న వివాదాన్ని పరిష్కరించి.. గిరిజనులకు డోలీలు మోతలు తప్పించాలి.
- సాలూరులో మహిళా కళాశాల ఏర్పాటు చేస్తామని గత వైసీపీ సర్కారు ఇచ్చిన హామీ గాలిలో కలిసిపోయింది. దీనిపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలి.
- జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలను నియమించాలి.
- మన్యాన్ని పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. దీనివల్ల యువతకు స్థానికంగానే ఉపాధి లభిస్తుంది. పరిశ్రమల ఏర్పాటుకు చొరవ చూపాలి.

వ్యక్తికి పాముకాటు.. డోలీలో ఆసుపత్రికి తరలింపు


ప్రమాదస్థితిలో అడారిగెడ్డను దాటుతున్న గిరిజనులు

మక్కువ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): దుగ్గేరుకు సమీపంలో గల గుంటభద్ర గ్రామానికి చెందిన సీదరపు ప్రసాద్‌కు పొలంలో బుధవారం పాముకాటు వేసింది. దీంతో విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు ఆయన్ని డోలీలో శంబర ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం సాలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం గుంటభద్ర సమీపంలోని అడారిగెడ్డ పొంగి ప్రవహిస్తోంది. దీంతో గ్రామస్థులు డోలీ కట్టి నడుం లోతుకు పైగా వరదనీరు ప్రవహిస్తున్న అడారిగెడ్డలో నుంచి ప్రసాద్‌ను గెడ్డను ప్రమాద స్థితిలో దాటించి ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా గుంటభద్ర గ్రామానికి చెందిన సీదరపు శుక్రమ్మ శనివారం అనారోగ్యంతో మృతిచెందింది. అయితే అడారిగెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఆమె కుటుంబాన్ని పరామర్శించేందుకు బంధువులు సైతం వెళ్లలేకపోయారు. కొందరు గిరిజనులు గెడ్డకు రెండు వైపులా తాడుకట్టి దాని సహాయంతో ప్రాణాలను సైతం లెక్కచెయ్యకుండా గుంటభద్ర గ్రామాన్ని సందర్శించి శుక్రమ్మ కుటుంబాన్ని పరామర్శించారు.

సీఆర్‌టీలకు న్యాయం చేయాలి

మక్కువ రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న సీఆర్టీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని మన్యం జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు వోలేటి తవిటినాయుడు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మండలంలోని శంబర, మక్కువ, ఎ.వెంకంపేట, వెంకటభైరిపురం, ఎర్రసామంతవలస జడ్పీ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన యూనియన్ సభ్యత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలల్లో 1240మంది సీఆర్టీలు పనిచేస్తున్నారన్నారు. వారిసేవలను గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చింతాడ అప్పారావు, ఎం.సత్య నారాయణ, మండల వెంకటరావు, గణేష్ పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో ప్రసవాలను ప్రోత్సహించాలి

కొమరాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు తల్లీ బిడ్డలకు ఎంతో శ్రేయస్కరమని డాక్టర్ జి.దేవేంద్ర సూచించారు. ప్రధాని మోదీ జన్మదినం పురస్కరించుకొని మండలంలోని చిన్న ఖర్జీల గ్రామంలో వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. పలువురు మహిళలకు వైద్య పరీక్షలు చేశారు.

ఎస్సీలను కూటమి తొక్కేస్తోంది

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కులస్థులను కూటమి ప్రభుత్వ తొక్కేస్తోందని వైసీపీ ఎస్సీసె రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ బాబు అన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ కల్యాణమండపం వైసీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్.పరీక్షిత్ రాజు అధ్యక్షతన జిల్లా విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా సుధాకర్‌బాబు పాల్గొని మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వపాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు ప్రభుత్వ పథకాలు ఇంటి వద్దకే వచ్చేవన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్ర పాలన చేపట్టి 15 నెలలు కావస్తున్న ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీని అమలు చేయలేక విమర్శలు ఎదుర్కొంటున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రులు రాజన్నదొర, పుష్పశ్రీవాణి, ఎమ్మెల్యేలు ఎ.జోగారావు, కళావతి, ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ టిడ్కో చైర్మన్ జె. ప్రసన్నకుమార్, మన్యం జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఎస్.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

36 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ

సీతానగరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులకు ఎరువుల కొరత నివారణకు చర్యలు చేపట్టడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎస్.అవినాష్ అన్నారు. బుధవారం బూర్జ, సీతానగరం గ్రామాల్లోని లైసెన్స్‌డ్ ఎరువుల దుకాణాలను ఆయన పరిశీలించారు. ఈ మేరకు బూర్జ నాయుడు ఫెర్టిలైజర్స్‌లో ఎరువుల నిల్వలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బూర్జలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విజయరామ గజపతి, నాయుడు ఫెర్టిలైజర్స్‌లో 24 మెట్రిక్ టన్నులు, బగ్గందొరవలస ప్యాక్ ద్వారా 12 మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. ఆయనతో పాటు వ్యవసాయ సహాయకులు, రైతులు ఉన్నారు.

మహిళల ఆరోగ్యమే సమాజానికి రక్ష

బొబ్బిలి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్యమే సమాజానికి రక్ష అ మున్సిపల్ చైర్మన్ రాంబార్కి శరత్‌బాబు అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం సూపరింటెండెంట్ డాక్టర్ గేదెల శశిభూషణరావు ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శరత్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం మహిళలకు ఓ వరం లాంటిదన్నారు. ఆరోగ్యకరమైన మహిళలు, బలమైన కుటుంబాల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక ఆరోగ్య శిబిరాలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. డాక్టర్ శశిభూషణరావు మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబరు 2 వరకు ఈ కార్యక్రమాన్ని అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, సబ్‌సెంటర్లలో నిర్వహించనున్నామన్నారు, అసంక్రమిత వ్యాధుల కోసం మహిళలకు స్క్రీనింగ్ పరీక్షలుంటాయన్నారు. కిశోరబాలికల ఆరోగ్య పరీక్షలు, క్షయవ్యాధి, మానసిక వైద్యసేవలు, ఆయుష్, రక్తపోటు, మధుమేహం, నోటిక్యాన్సర్, రొమ్ముక్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ పరీక్షలను నిర్వహించి ఉచిత మందులు సరఫరా చేస్తామని ఆయర వివరించారు.

సమష్టిగా శరన్నవరాత్రులు జయప్రదం చేద్దాం

- ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ


శరన్నవరాత్రుల వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

పాలకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రుల ఆరాధ్య దేవత కోటదుర్గమ్మ దసరా ఉత్సవాలను అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల సమన్వయంతో విజయవంతం చేద్దామని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పిలుపునిచ్చారు. ఆలయ ఆవరణలో బుధవారం ఉత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కోటదుర్గమ్మ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఒక ప్రాముఖ్యత ఉందన్నారు. ఐక్యంగా ఉత్సవాలను నిర్వహించిన విజయవంతం చేద్దామన్నారు. అంతకుముందు ఉత్సవాలకు సంబంధించి ఏర్పాట్లపై ఆలయ ఈవో సూర్య నారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మలతో మాట్లాడారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కర్నేన అప్పలనాయుడు, గంటా సంతోష్‌కుమార్, గర్భాన సత్తిబాబు, వెన్నపు శ్రీనివాసరావు, కొరికాన గంగునాయుడు, కొండదాడి రాజేష్, కిమిడి కాశీన్నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంత్యుత్సవాలు


విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువెళ్తున్న స్వర్ణకార సంఘం సభ్యులు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మ జయంతి ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ ప్రధాన రహదారిలోని పార్వతీదేవీ ఆలయంలో విశ్వకర్మ భగవానుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి దుర్గాదేవి ఆలయ సమీపంలో నిర్మించనున్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రాంగణం వరకు విశ్వకర్మ విగ్రహాన్ని మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువెళ్లారు. ఆలయ ప్రాంగణం వద్ద విశ్వకర్మ విగ్రహానికి పూజల అనంతరం అనుపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితుడు, సర్వమంగళాదేవి పీఠం పీఠాధిపతి మురపాక కాళిదాసు శర్మ మాట్లాడుతూ విశ్వకర్మ భగవానుడు సప్తలోకాల సృష్టికర్త అన్నారు. విశ్వకర్మను పూజించడం ద్వారా సకల పాపాలు తొలగుతాయన్నారు. అనంతరం కె.రామ్మోహనరావు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో పట్టణ స్వర్ణకార సంఘ అధ్యక్ష, కార్యదర్శులు బి.రంగా, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

- సాలూరు రూరల్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత విశ్వకర్మ విగ్రహాన్ని ఊరేగించారు.

సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతాలు

సాలూరు రూరల్/పాచిపెంట, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): కందిరివలసలో గిరిజనులు బుధవారం సామూహికంగా వేంకటేశ్వరస్వామి వ్రతాలను చేశారు. సాలూరు సనాతన ధర్మపరిషత్, సుబ్బ గురువు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. తొలుత గిరిజనులు తమ గ్రామాల్లో శోభాయాత్రను నిర్వహించారు. అనంతరం రుత్వికుడు వినయశర్మ వ్రతాలను చేయించారు. కార్యక్రమంలో సుబ్బ గురువు, హరేకృష్ణ గ్రామీణ సంఘం వ్యవస్థాపకుడు మధుపతి దాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం



శిబిరంలో పాల్గొన్న జిల్లా అధ్యక్షుడు

బెలగాం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా బుధవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం ఏర్పాటైంది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధాని మోదీ పుట్టిన రోజున సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. శిబిరంలో 75 మంది రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సొండి సంజీవ్, పట్టణ అధ్యక్షురాలు వి.పార్వతి, అల్లూరి పేర్రాజు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు

పాలకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి):శాంతి భద్రతల పరిరక్షణకు పోలీస్ సిబ్బంది చర్యలు చేపట్టాలని డీఎస్పీ ఎం.రాంబాబు అన్నారు. బుధవారం పోలీస్ సిబ్బందితో స్థానిక రమా సత్యనారాయణ కల్యాణ మండపంలో మాట్లాడారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలన్నారు. రాత్రివేళల్లో ప్రత్యేక గస్తీను ఏర్పాటు చేసి నేర నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు సీఐ ప్రసాదరావు, ఎస్ఐలు కళాధార్, అప్పారావు, ప్రయోగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మ కమలాలు


పువ్వులు చూపుతున్న ఈశ్వరరావు

కొమరాడ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): సోమినాయుడువలసకు చెందిన అగ్గాల ఈశ్వరరావు నివాసంలో బ్రహ్మ కమలం మొక్కకు పది పువ్వులు వికసించాయి. వాటిని చూసేందుకు స్థానికులు ఆసక్తి చూపుతున్నారు.

రెగ్యులర్ వీఆర్‌వోలను నియమించాలి

కొమరాడ, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు పెద్ద పంచాయతీలకు రెగ్యులర్ వీఆర్‌వోలను నియమించాలని సీపీఎం నాయకులు కొల్లి సాంబమూర్తి జేసీ యశ్వంత్‌కుమార్ రెడ్డిను కోరారు. బుధవారం మండల కేంద్రంలో పర్యటనకు వచ్చిన ఆయనను కలిసి సాంబమూర్తి మాట్లాడారు. వీఆర్‌వోలు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. మండలంలో కొమరాడ, పాలెం, కెమిశీల, ఉలిపిరి పంచాయతీలకు రెగ్యులర్ విఆర్‌వోలను నియమించాలని కోరారు. ఇందుకు జేసీ సానుకూలంగా స్పందించారు.

ఉపాధి వేతనాలు అందేలా చూడండి



సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

సీతంపేట రూరల్, సెప్టెంబరు17 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ వేతనదారులకు వేతనాలు అందేలా చూడాలని పలువురు సభ్యులు డిమాండ్ చేశారు. గడచిన కొన్ని వారాలుగా ఉపాధి వేతనాలు చెల్లించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సర్పంచ్‌లు జీలకర్ర సుందరమ్మ, తిరుపతిరావు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ బి.ఆదినారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో యూరియా కొరత, రహదారుల నిర్మాణాలపై పలువురు సభ్యులు అధికారులను ప్రశ్నించారు. యూరియా అరకొరగా సరఫరా చేయడం వల్ల ఇబ్బందులు పడుతున్నామని సర్పంచ్‌లు కోటేశ్వరరావు, తిరుపతిరావు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఏవో వాహిని మాట్లాడుతూ గతేడాది కంటే ఈ ఏడాది యూరియాకు డిమాండ్ పెరిగిందన్నారు. రైతుల అవసరం మేరకు యూరియా తెప్పించి పంపిణీ చేస్తామని ఏవో బదులిచ్చారు. అనంతరం గిరిజన సంక్షేమ ఇంజనీరింగ్ శాఖ డీఈ నాగభూషణరావు మాట్లాడుతూ రహదారి కనక్టవిటీ లేని 75 గ్రామాలకు రహదారుల అనుసంధానం కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. అలాగే సమావేశంలో ఏజెన్సీలోని గిరిజనులకు చెందిన భూములను రీసర్వే చేయాలని సభ్యులు అధికారులను కోరారు. సమావేశంలో ఎంపీడీవో బిబి మిశ్రో, తహసీల్దార్ శ్రీకన్య తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో పలువురి చేరిక

వీరఘట్టం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక క్యాంప్ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సమక్షంలో గడగమ్మ, కిమ్మి గ్రామాలకు చెందిన 250 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు జనసేనలో చేరారు. వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆయన సాదరంగా ఆహ్వానించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. కార్యక్రమంలో ఉదయాన ఉదయ్‌భాస్కర్, పొదిలాపు కృష్ణమూర్తినాయుడు, జామి లక్ష్మీ నారాయణ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ

సాలూరు, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో పోలీసు స్టేషన్‌లో ఇటీవల పట్టణంలోని గిరిజన ఉద్యోగుల న్యాయ సలహాదారుడిపై గిరిజనులు పెట్టిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై బుధవారం ఏఎస్పీ అంకితా సురానా విచారణ నిర్వహించారు. దీనిపై పట్టణ సీఐ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ పాచిపెంట మండలం గుమ్మిడి గుడ్డివలస గ్రామానికి చెందిన జన్ని పకీరు, జన్ని అప్పన్నలకు చెందిన భూమికి సంబంధించిన డాక్యుమెంట్లు రేగు మహేష్ తన వద్ద ఉంచుకున్నాడన్నారు. అడి గితే ఇవ్వనన్నారని, అంతేకాకుండా కులం పేరుతో దూషించారని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. దీనిపై విచారణ నిర్వహించినట్టు తెలిపారు. నిందితుడు రేగు మహేష్‌తో పాటు పలువురిని విచారించామన్నారు.

మెడికల్ షాపుల్లో తనిఖీలు

సాలూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు మెడికల్ షాపుల్లో ఔషధ నియంత్రణాధికారి షేక్ ఆశా బుధవారం తనిఖీలు నిర్వహించారు. షాపుల్లో నిబంధనల ప్రకారం అమ్మకాలు జరుగుతున్నాయా లేదా పరిశీలించారు.

ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సంతోష్

సాలూరు, సెప్టెంబరు 17(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. కార్యనిర్వాహక అధ్యక్షుడిగా కె.సంతోష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం ఆలయంలో ఆలయ అర్చ కులు నారాయణ గురుస్వామి, విజయ్‌గురుస్వామి ఆలయంలో పూజలు నిర్వహించి నూతన కార్యనిర్వాహక కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

శస్త్రచికిత్సలకు 51 మంది ఎంపిక

సీతానగరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక పీహెచ్‌సీలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం ఏర్పాటైంది. శంకర్ ఫౌండేషన్‌కు చెందిన నేత్ర వైద్యులు 86 మందికి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 51 మందిని నేత్ర శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఉషారాణి, శంకర్ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ సీహెచ్ వెంకటరమణ, ఆప్తాలమిక్ సహాయకులు దీపక్, హెల్త్ సూపర్‌వైజర్ వెంకటరమణ పాల్గొన్నారు.

ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలి

పాలకొండ, సెప్టెంబర్ 17 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఆటో, క్యాబ్ డ్రైవర్లను ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు, ఆటో డ్రైవర్ యూనియన్ అధ్యక్షుడు కాద రాము డిమాండ్ చేశారు. 18న విజయవాడలో తలపెట్టిన ధర్నాకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో, క్యాబ్ డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. జీవో నెంబర్ 21 రద్దు చేయాలన్నారు. పాపారావు, సింహాచలం, టి.దుర్గారావు, సురేష్ పాల్గొన్నారు.

మూలకు చేరిన పుష్ కార్ట్స్


మున్సిపల్ కార్యాలయ ఆవరణలో మూలకు చేరిన పుష్ కార్ట్‌లు

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మున్సిపాల్టీలోని 30 వార్డుల్లో చెత్త మళ్లింపునకు ఉపయోగించే పుష్ కార్ట్‌లు మూలకు చేరాయి. వాటిని కొద్దిపాటి మరమ్మతులతో తిరిగి వినియోగంలోకి తెచ్చే అవకాశం ఉన్నా ఆ దిశగా మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టడంలేదు. కొన్ని రోజులుగా దాదాపు 20 పుష్‌కార్ట్‌లు మున్సిపల్ కార్యాలయంలో పడి ఉన్నాయి. చెత్తలు, వ్యర్థాల తొలగింపునకు పారిశుధ్య కార్మికులు పుష్ కార్ట్‌లను వినియోగిస్తుంటారు. అలాంటివి మూలకు చేరినా యంత్రాంగం పట్టించుకోని తీరు పలు విమర్శలకు తావిస్తోంది. ఇదే విషయమై మున్సిపల్ పర్యవేక్ష ఇంజనీర్ సన్యాసిరావును వివరణ కోరగా రెండు రోజుల్లో పుష్ కార్ట్‌లను మరమ్మతులు చేయించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించామన్నారు.

చెత్త శుద్ధికి ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పార్వతీపురం టౌన్, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని రాయగడ అంతరాష్ట్ర రోడ్డు శివారులోని డంపింగ్ యార్డులో త్వరలో చెత్తశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు తెలిపారు. డంపింగ్ యార్డుతో పార్వతీపురం పట్టణ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఈనెల 12న 'ఎన్నాళ్లీ నరకం?' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి మున్సిపల్ ప్రజారోగ్యశాఖాధికారులు స్పందించారు. డంపింగ్ యార్డులో త్వరలో చెత్తశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ప్రకటించారు. చెత్త నుంచి ఆర్థిక వనరుల సృష్టి అన్న నినాదంతో ముందుకు వెళ్తామన్నారు. విశాఖపట్టణానికి చెందిన తరుణి అసోసియేట్స్ సంస్థ చెత్త శుద్ధి కేంద్ర నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నట్టు స్పష్టం చేశారు. మరో నెలరోజుల్లో చెత్త శుద్ధికి సంబంధించి పనులు ప్రారంభం కానున్నాయని ఆయన వివరించారు.

తగ్గుముఖం పట్టిన వరద ప్రవాహం


గేట్ల నుంచి దిగువకు విడుదల చేస్తున్న వరద

గరుగుబిల్లి, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని నాగావళికి బుధవారం వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతాల నుంచి 4,900 క్యూసెక్కుల నీరు చేరుతుండగా, స్పిల్‌వే గేట్ల నుంచి దిగువ ప్రాంతాలకు 5 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గానూ 104.35 మీటర్ల నీరు నిల్వ ఉంది. సాగునీటి అవసరాల నిమిత్తం 1,320 క్యూసెక్కుల నీటిని ప్రధాన కాలువల నుంచి విడిచిపెట్టారు.

తహసీల్దార్ కార్యాలయంలో తనిఖీ


అప్పయ్యపేట గ్రామస్థులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

సీతానగరం, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): మండల రెవెన్యూ కార్యాలయాన్ని సబ్ కలెక్టర్ వైశాలి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల స్థలాలు, సర్టిఫికెట్ల కోసం తహసీల్దార్ ప్రసన్నకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అప్పయ్యపేట గ్రామాన్ని సందర్శించి సచివాలయ సిబ్బంది, గ్రామస్థులతో మాట్లాడారు. తహసీల్దార్‌తో పాటు డీటీ ఉమామహేశ్వరరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పనుకువలసలో విగ్రహావిష్కరణలు


విగ్రహాలను ఆవిష్కరిస్తున్న డీఎస్పీ

పాలకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పనుకువలస ప్రాథమిక పాఠశాలలో బుధవారం జ్ఞాన సరస్వతి, మహాత్మాగాంధీ, సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాలను డీఎస్పీ రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సమాజానికి ప్రభావితం చేసిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. విద్యార్థులను తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో పి.కృష్ణమూర్తి, హెచ్ఎం వేణుగోపాలనాయుడు, మాజీ ఎంపీపీ సామంతుల దామోదరరావు, ఎంఈవో సోంబాబు, పనుకువలస సర్పంచ్ కోట మంజు భార్గవి, ఎంపీటీసీ కోట అజయ్‌కుమార్, విగ్రహదాత డి.పార్వతి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఇంట్లోకి చొరబడిన కొండచిలువ


ఇంట్లోకి చొరబడిన కొండచిలువ ఇదే..

పాలకొండ, సెప్టెంబరు 17 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలోని చల్లా భాను ఇంట్లోకి బుధవారాం రాత్రి కొండచిలువ చొరబడింది. విషయం గమనించిన ఆయన కుటుంబ సభ్యులు భయంతో ఇంటిలో నుంచి బయటకు పరుగులు తీశారు. అటవీశాఖ అధికారులకు వారు సమాచారం అందజేశారు. దాంతో అటవీశాఖ కానిస్టేబుల్ తారకేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని కొండ చిలువను పట్టుకున్నారు. దాన్ని సమీపంలోని అటవీ ప్రాంతంలో విడచిపెట్టారు.